ఎన్నికల హామీలకు తూట్లు

- మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట
- మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- గోస్పాడులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి విశేష స్పందన



వైఎస్సార్‌సీపీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

గోస్పాడు: ఎన్నికల హామీలను అమలు చేయకుండా చంద్రబాబు తూట్లు పొడుస్తున్నారని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మండలకేంద్రం గోస్పాడులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు అశోక్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ కూటమి నేతలు రాష్ట్ర ప్రజలను సూపర్ సిక్స్ పథకాల పేరుతో మోసం చేసి అధికారాన్ని దక్కించుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మేనిఫెస్టో పక్కాగా అమలైందన్నారు. హామీ ఇస్తే అమలు చేయాలన్నది తమ అధినేత వైఎస్ జగన్ అభిమతం అన్నారు. గోస్పాడులో అమ్మఒడి పథకం కింద 449 విద్యార్థుల తల్లుల ఖాతాలో నేరుగా నగదు జమ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం 376 మంది విద్యార్థుల తల్లులకే పథకం వర్తింపజేశారన్నారు. సంఖ్య పెరగాల్సింది పోయి తగ్గడమేమిటో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల ముందు మాత్రం ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి పథకం వర్తింపజేస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చాక కోతలు విధించారని మండిపడ్డారు. ఇక రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఊసేలేదన్నారు. ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు పైసా సాయం చేయలేదని ధ్వజమెత్తారు. 50 ఏళ్లకు పింఛన్, 18 ఏళ్లు దాటిన వారికి ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు భృతి, ఉచిత బస్సు ఇలా అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. జూనియర్ న్యాయవాదులకు ప్రతినెల రూ.10 వేలు స్టైఫండ్ ఇస్తామని చెప్పి వారిని మోసం చేశారన్నారు. నమ్మక ద్రోహం చేసిన కూటమి సర్కారుకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ప్రహ్లాదరెడ్డి, గోస్పాడు ఎంపీపీ ఆర్థర్ సైమాన్, ఉప మండల అధ్యక్షుడు రాజు, వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు పీపీ రాజశేఖర్ రెడ్డి, పీపీ మధుసూదన్ రెడ్డి, యాళ్లూరు మాజీ సొసైటీ అధ్యక్షుడు బెక్కెం రామ సుబ్బారెడ్డి, సర్పంచులు రాజారెడ్డి, శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, యాసం రామ సుబ్బారెడ్డి, బొబ్బిటి దామోదర్ రెడ్డి, భక్తవత్సల రెడ్డి, బోరెడ్డి గోపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ యాదవ్, లింగారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, ఆమిదల నారాయణ, అన్నయ్య, కూలూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మి మోసపోయాం

- బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ప్రజలు ఆవేదన
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చాలా మేలు జరిగిందని వెల్లడి
- ఎన్నికల హామీలపై కూటమి నాయకులను నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపు



కూటమి పాలనలో ఎలాంటి మేలు జరగలేదని మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి ఎదుట వాపోతున్న మహిళలు



గంగుల బిజేంద్రారెడ్డి, భూమా కిశోర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న స్థానికులు

ఆళ్లగడ్డ: రీకాలింగ్ చంద్రబాబూస్ మేని ఫెస్టో కార్యక్రమానికి నియోజకవర్గంలో అపూర్వ స్పందన వస్తోంది. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 3 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు లబ్ధి చేకూరగా, కూటమి ప్రభుత్వం పాలనలో రూపాయి మేలు కూడా జరగలేదు. ఎన్నికల్లో చంద్రబాబు మాయమాటలను నమ్మి ఓటేసి మోసపోయా'మని ప్రజలు మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఎదుట వాపోయారు. మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలో 'ఇంటింటికి బాబు మోసాలు' కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమా కిశోర్‌రెడ్డి, పార్టీ మునిపల్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గొట్లూరు సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ, క్షేత్ర స్థాయి వైస్సార్‌సీపీ నేతలతో కలిసి ఇంటింటికి వెళ్లారు. కుంకుమ తిలకాలు దిద్దుతూ గజమాలలతో స్వాగతం పలికారు. గతంలో మేము టీడీపీ అయినా ఏమాత్రం సిఫార్సులు లేకుండా అర్హత ఉంటే సంక్షేమ పథకాలు ఇంటి దగ్గరకే వచ్చి అందించారని మళ్లీ ఆ రోజులు రావాలని కోరుకుంటున్నామని మహిళలు బహిరంగంగా చెప్పడం గమనార్హం. అనంతరం గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 600 హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం ఒక్క పథకం కూడా సంపూర్ణంగా అమలు చేయకుండా మోసం చేశారన్నారు. చంద్రబాబు చెప్పే మాటలు నమ్మరని స్థానిక కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు బాండ్లు పంచారన్నారు. హామీలు అమలు చేయకపోతే తమ కాలర్ పట్టుకొని అడగాలని చెప్పారన్నారు. ఇప్పుడు వారు ఎక్కడా కనబడటం లేదన్నారు. ఎప్పుడైనా ఇంటిదగ్గరకు వస్తే మా బాకీ ఎప్పుడిస్తారని నిలదీయాలని పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోను మరో సారి మీకు గుర్తు చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పా రు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సురేంద్ర, ఏఎ స్ఆర్ బాషా, హ్యాపీ బాషా, సునీల్ తదితరులున్నారు.

క్లుప్తంగా

బెస్ట్ మోడల్ స్కూల్‌గా శిరివెళ్ల ఎంపిక



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డీఈఓ

శిరివెళ్ల: జిల్లాలో బెస్ట్ స్కూల్‌గా శిరివెళ్ల మోడల్ స్కూల్ ఎంపికైందని డిప్యూటీ డీఈఓ శంకరప్రసాదు అన్నారు. మంగళవారం బెస్ట్ స్కూల్‌కు గుర్తుగా మోడల్ స్కూల్ ఆవరణలో శిలాఫలకం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 40 స్కూల్స్ ఉంటే అందులో శిరివెళ్ల స్కూల్ బెస్ట్‌గా గుర్తుంపు పొందిందన్నారు. పరిశుభ్రత, విద్యాభివృద్ధి, క్రమ శిక్షణ, పది ఫలితాలు ఇలా వివిధ అంశాల్లో ఎంపిక చేశారన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం మాట్లాడుతూ పాఠశాల మౌళిక వసతుల కల్పనకు రూ. 36.92 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యామా గుర్రప్ప, తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

మార్గదర్శకాలకనుగుణంగా పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

గోస్పాడు: వైద్య సిబ్బంది మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ శారదా బాయి అన్నారు. మంగళవారం జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణపై నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగుల పరీక్షలకు సంబంధించిన నివేదికలను సకాలంలో పంపాలన్నారు. రోగులకు సేవల్లో ఇబ్బందులు లేకుండా సిబ్బంది చూడాలన్నారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్ మాట్లాడుతూ ప్రతి పాజిటివ్‌ను ఏఆర్‌టీకి లింకు చేసి మందులు తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రములో ఏఆర్‌టీ వైద్యులు డాక్టర్ నౌషీన్, దేవి శంకర్ గౌడ, ఐసీటీసీ కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ఏపీ మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



ప్రత్యేక అలంకరణలో శ్రీకాళికాంబాదేవి

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. ఉదయం నుంచి భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళిమాత సేవా సమితి వారు భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి వేడుకలు



శ్రీకాళికాంబ దేవస్థానంలో పూజలందుకున్న జంటనాగులు

నంద్యాల(వ్యవసాయం): శ్రావణమాసం నాగ పంచమిని పురస్కరించుకొని భక్తులు మంగళ వారం ఉదయాన్నే జంట నాగులకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని పార్కురోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల, శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని నాగలింగేశ్వరస్వామి దేవస్థానం, కాళికాంబ చంద్రశేఖర దేవస్థానం, బైటిపేట ఆంజనేయ స్వామి దేవస్థానం, సంజీవనగర్ రామాలయంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు వాయినాలు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

నంద్యాల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ సంస్థ చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య సంబంధిత అధికారులు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ సంస్థ చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య (రిటైర్డ్ ఐఏఎస్) అధ్యక్షతన సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ మనషుల జీవితంలో భాగమైందన్నారు. దీనిని క్రమేపి తగ్గించడానికి చైతన్యం అవసరమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని చెప్పారు. ఇది పట్టణాల్లో అమలయ్యేలా మున్సిపల్ కమిషనర్లు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నియంత్రించడానికి అనేక చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 11 ఈ వేస్ట్ సెంటర్లను ఏర్పాటు చేశామని, పర్యావరణ పరిరక్షణకు గాను దేవాలయాల్లో ప్లాస్టిక్ బదులుగా వెదురుతో తయారు చేసిన కప్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు అందరికీ చైర్మన్, కలెక్టర్ జ్యూట్ బ్యాగ్స్ అందజేశారు. సమావేశంలో డీఆర్‌ఓ డి.రాము నాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఏపీఐఐసీ జెడ్‌ఎం మధుసూదన్ రెడ్డి, డీఎంజీఓ వేణుగోపాల్, వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్లు లక్ష్మీ నాయక్, చందన హర్ష, డీటీసీ ఐశ్వర్య రెడ్డి, డీఈఓ జనార్దన్ రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, మార్కెటింగ్ ఏడీ రమణ, పరిశ్రమల శాఖ జీఎం ఎస్.మహబూబ్ బాషా, ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవీలత, డీపీఓ లలితా బాయి, ఐసీడీఎస్ పీడీ లీలావతి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, మైనింగ్, ఆర్టీసీ, సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: పీఎం సూర్యఘర్ పథకం కింద జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పీఎం సూర్య ఘర్ పథకంపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా ఆదాయం పెరగడంతో పాటు పొల్యూషన్ నివారణ జరుగుతుందన్నారు. ఒకసారి ఇంటిపై కప్పులపై సోలార్ ప్యానల్ పెట్టుకుంటే 25 ఏళ్ల వరకు విద్యుత్ సమస్య ఉండదన్నారు. ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి అయితే ప్రభుత్వానికి అమ్మవచ్చు, కరెంటు పోతుందనే టెన్షన్ ఉండదన్నారు. ప్రతి గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి ప్రతి ఇంటి రూఫ్ టాప్ పైన సోలార్ ప్యానళ్లు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు బ్యాంకర్ల సహకారం తీసుకోవాలన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



చిన్నారుల నృత్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ : అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఎంఈఓ 1 రఘురామిరెడ్డి కార్యకర్తలు గురులక్ష్మికి ఆదేశించారు. మంగళవారం స్థానిక స్పెషల్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటా తిరిగి పిల్లలు కేంద్రాల్లో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు చేపట్టిన ఆటపాటలను, నృత్యాలను పరిశీలించి ఆయన అభినందించారు.

మనోభావాలను దెబ్బతీయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్‌మేవా నాయకులు

నంద్యాల(వ్యవసాయం): తమ మనోభావాలను దెబ్బతీయొద్దని ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ సభ్యులు అన్నారు. శ్రీశైలం చెక్ పోస్ట్ వద్ద ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చెందిన ముస్లిం డ్రైవర్ తలపై టోపీ ధరించి డ్రైవింగ్ చేయడాన్ని శ్రీశైలం చెక్ పోస్ట్ సిబ్బంది అభ్యంతరం తెలపడం సరికాదన్నారు. మంగళవారం పట్టణంలోని సలీంనగర్‌లో ఉన్న ఆల్ మేవా ఏపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఇంజనీర్ ఇమ్రాన్ పాష, గౌరవ అధ్యక్షుడు ఎస్ఎండీ అబులైస్, జిల్లా జనరల్ సెక్రెటరీ ఎస్ఎండీ సలీం విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా సరే ఇతర మతాల సంప్రదాయాలను గౌరవించాలన్నారు.

పులుల సంరక్షణతోనే మానవ మనుగడ

మహానంది: పులుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ప్రతినిధి దూపాడు శ్రీధర్ అన్నారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌ఝా ఆధ్వర్యంలో గ్లోబల్ టైగర్ డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాలు, ఆక్సిజన్ ఆక్సిజన్, ఆహారం మానవాళికి అందాలంటే అడవులు ఎంతో కీలకమని, అలాంటి అడవులు సంరక్షణలో ఉండాలంటే పులుల సంతతి పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డీఆర్‌ఓ హైమావతి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

- మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో చైర్‌పర్సన్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(న్యూటౌన్): అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మునిసిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని అధికార పక్ష కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పోడియం ఎదుట బైఠాయించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి పనులు జరిగేలా చూడాలన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కౌన్సిలర్లు కోరారు. కుక్కలకు కు.ని ఆపరేషన్లు చేయించాలని కౌన్సిలర్ కోరగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి త్వరలో చేపడుతామని కమిషనర్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా కొత్త పింఛన్ల పంపిణీ చేపట్టలేదన్నారు. 41వ వార్డు పరిధిలో మసీదుకు సంబంధించిన పన్ను మినహాయింపు చేయాలని కౌన్సిలర్ పున్నారాజేశ్వరి కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు చంద్రశేఖర్, మురళీ, మున్సిపల్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



నర్సిపల్లె గ్రామంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని హరివరం, నర్సిపల్లె, పడిగెపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు జీవామృతం, ఘనామృతం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని ఎక్కువ వినియోగిస్తున్నారని, దీంతో పెట్టుబడులు అధికమవుతున్నాయన్నారు. మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం ఈ ఏడాది మండలంలో పెరిగిందన్నారు. ఈ పంట సాగులో సమగ్ర కలుపు నివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఏఈఓ రాణెమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు సిద్దిఖ్‌భాషా పాల్గొన్నారు.

రాయితీపై డ్రోన్ పంపిణీ



రైతుకు డ్రోన్‌ను అందజేస్తున్న ఏఓ

దొర్నిపాడు:మండలకేంద్రం దొర్నిపాడు రైతు సేవాకేంద్రం పరిధిలోని సతీష్ అనే రైతుకు 80 శాయితీతో 10 లీటర్ల సామర్థ్యం గల డ్రోన్‌ను మంగళవారం మండల వ్యవసాయాధికారి ప్రమీల పంపిణీ చేశారు. కిసాన్ డ్రోన్ వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 5 మంది రైతులు గ్రూప్‌గా ఏర్పడాలన్నారు. అందులో ఒకరిని డ్రోన్ పైలెట్‌గా ఎంపిక చేసి 12 రోజుల శిక్షణ అనంతరం డ్రోన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. డ్రోన్ కావాల్సిన రైతులు స్థానిక వ్యవసాయ కారాలయంలో అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలను ఉపేక్షించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

నంద్యాల: గంజాయిని అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా ఉపేక్షించరాదని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై జేసీ విష్ణుచరణ్, అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో పార్శిల్ ద్వారా గంజాయి రాకుండా చూసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ, గ్రామీణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నిఘా పెట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏఎస్పీ యుగంధర్‌బాబు మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో గంజాయి అమ్మేవారిపై 9 కేసులు నమోదు చేసి 15 కేజీల గంజాయిని సీజ్ చేసి 20 మందిని అరెస్ట్ చేశామన్నారు. జిల్లాలో గంజాయి అమ్మినా, వాడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్ హనుమన్న, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, రైల్వే, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

ఉయ్యాలవాడ : సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆధార్ డేటా ఎంట్రీలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. బంగారు కుటుంబాలను గుర్తించేందుకు గ్రామాల్లో మరో సారి పీ సర్వే చేపట్టాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సంఘీభావం తెలుపుతున్న పట్టణ పౌరుల సంక్షేమ సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్‌స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పట్టణ పౌరుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బాబురావు, ఐక్యవేదిక కన్వీనర్ పుల్లా నరసింహ, లింగస్వామి అన్నారు.ఈ అంశంపై ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను బిగిస్తే ఇంట్లో టైంబాబు ఉన్నట్లేనని అన్నారు. ప్రజలు, మేధావులు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసమూర్తి, ఏసురత్నం, గౌస్, అబులైజ్, సమ్మద్, మౌలానా ముస్తాక్, అన్సర్‌బాషా, ఎస్‌వైడీ ప్రసాద్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సర్పాల సయ్యాట



దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామం ఎస్సీకాలనీలోని సీసీ రోడ్డుపై మంగళవారం రెండు పాములు సయ్యాటలాడుతూ కనిపించాయి. నాగులచవితి రోజున అవి పెనవేసుకొని పెనుగులాడుతుండటాన్ని స్థానికులు గమనించి సెల్‌లో చిత్రీకరించారు. ఎంత మంది అలజడి చేసినా అవి పట్టించుకోలేదు. గంట తర్వాత అవి అక్కడి నుంచి వెళ్లి పోవడంతో స్థానికులు ఆ దారిలో రాకపోకలు సాగించారు.

ఫెన్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక





ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా రాధిక, ప్రధాన కార్యదర్శిగా నీలకంఠేశ్వరుడు ఎన్నికైనట్లు తెలిపారు. ఫెన్సింగ్ క్రీడను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ప్రకటించారు.

యూరియా అందించండి



చిత్రేనిపల్లెలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సుమతి

రుద్రవరం: ఎలాగు వ్యవసాయం చేసుకునేందుకు సాయమందించడం లేదు కనీసం యూరియా అయిన అందించాలని మండల వ్యవసాయాధికారి సుమతిని రైతులు కోరారు. మండల పరిధిలోని చిత్రేనిపల్లెలో మంగళవారం ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అక్కడికి వచ్చిన రైతులందరు పంటల సాగుకు సూచనలు ,సలహాలు తమకు అవసరం లేదని యూరియా కొరతను తీర్చాలన్నారు. యూరియా బస్తా ధర రూ.270 లోపు ఉంటే బయట రూ.450 పలుకుతోందని అదికూడా నాలుగు రకాల ఎరువు బస్తాలు తీసుకుంటే ఒక్క యూరియా బస్తా ఇస్తున్నారని వాపోయారు. ఏఓ మాట్లాడుతూ త్వరలో ఓ లారీ యూరియా చిత్రేనిపల్లెకు వస్తుందని అప్పుడు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

ఈక్రాప్ నమోదు తప్పని సరి

గోస్పాడు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి అన్నారు. మండలంలోని యాళ్లూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు, పంట నష్టపరిహారం, పంట బీమా, పంట కొనుగోలు తదితర సౌకర్యాలు అందుతాయని తెలిపారు. రైతులందరూ తప్పక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రామకృష్ణ, నాగార్జున,అగ్రికల్చర్ అసిస్టెంట్ అహ్మద్, హరి, రైతులు పాల్గొన్నారు.